
మినరల్ వాటర్ పేరుతో ప్రజలకు గరళాన్ని సరఫరా చేస్తున్నారు. వాటర్‌ప్లాంట్ల వ్యాపారుల దందాను పట్టించుకునే నాథుడే లేడు. పల్లె, పట్నం తేడా లేకుండా క్యాన్, ప్లాస్టిక్ బాటిల్, ప్యాకెట్ నింపుడుతో లక్షల నీటి వ్యాపారం చేస్తున్నారు. జిల్లాలో అధికారిక లెక్కల ప్రకారం రెండువేల వాటర్ ప్లాంట్లు ఉన్నట్లు తెలుస్తోంది. మినరల్, ప్యాకేజ్డ్, డ్రింకింగ్, ఆల్కలైన్ వాటర్ పేర్లతో కాసుల వేట కొనసాగిస్తున్నారు. మినరల్‌వాటర్ పేరుతో సాధారణ నీటిని నింపి ప్రజల గొంతులో హాలాహలం నింపుతున్నారు. అది తెలియని జనం తాగేసి రోగాలను కొనితెచ్చుకుంటున్నారు. ఎక్కడా ఆహార భద్రతా ప్రమాణాలు పాటించలేదు. ప్రజల ఆరోగ్యంతో యథేచ్ఛగా చెలగాటమాడుతున్నా ఆహార భద్రతా తనిఖీ శాఖ అటు వైపే చూసిన పాపాన పోలేదు.



కొత్తచెరువులో విక్రయానికి వెళుతున్న నీటి ట్యాంకర్



మినరల్ పేరుతో గరళం!

శుద్ధిలేదు.. శుభ్రతలేదు.. మార్గదర్శకాలు గాలికి..



పుట్టపర్తి రూరల్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): శుద్ధిజల ప్లాంట్లతో మొదలుకుని దుకాణాల్లో ప్లాస్టిక్, ప్యాకేజ్డ్ బాటిళ్లలో నీటిని నింపి విక్రయిస్తున్నారు. తాగునీటి శుద్ధిజల ప్లాంట్లు వీధివీధికీ వెలుస్తున్నాయి. ఐఎస్ఐ గుర్తింపు లేకపోయినా ట్యాంకర్లు, చిన్నచిన్న వాహనాల్లో మైకులు పెట్టి వ్యాపారం చేస్తున్నారు. 20 లీటర్ల క్యాన్ రూ. 15 నుంచి రూ. 20 వరకు విక్రయిస్తున్నారు. క్యాన్లను ఎప్పటికప్పుడు పొటాషియం పర్మాంగనేట్‌తో శుభ్రం చేయడంతోపాటు స్టెరిలైజ్ చేయాలి. ఇలా ఎక్కడ చేయడంలేదు. నెలల తరబడి క్యాన్లను శుభ్రం చేయకపోవడంతో.. పాచిపడుతున్నా అలాగేనింపి విక్రయిస్తున్నారు.

మార్గదర్శకాలకు తిలోదకాలు..

ఐఎస్ఐ, ఐఎస్ఓ రిజిస్ట్రేషన్లతోపాటు కాలుష్య నియంత్రణ, వేస్ట్ కంట్రోల్ (ద ఎ వ పత్రాలు, ట్రేడ్ మార్క్ రిజిస్ట్రేషన్ వంటి 14 మార్గదర్శకాలు పాటించాలి. మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు పంచాయతీ, మున్సిపాలిటి అనుమతులు తప్పనిసరి. మైక్రోబయాలజీ, కెమిస్ట్రీ వంటి అర్హత ఉన్నవారిని ల్యాబ్ టెక్నీషియన్‌గా నియమించాలి. నిత్యం నీటిని పరీక్షించి పీహెచ్ స్థాయి పది కంటే తగ్గకుండా చూడాలి. కాల్షియం, మెగ్నీషియం ఎంత మోతాదులో ఉందో గమనించాలి. ప్లాంటులో ప్రతి పదివేల లీటర్ల నీటికి ఒకసారి ఫిల్టర్లు మార్చాల్సి వుంది. ఇవేవీ పాటిస్తున్న దాఖలాలు లేవు.

ప్లాస్టిక్ బాటిళ్ల నింపుడు దందా..

ఐఎస్ఐ గుర్తింపు, బ్రాండెడ్ తాగునీటి ప్లాస్టిక్ బాటిళ్ల కన్నా సగం ధరకే ఇస్తుండడంతో దుకాణదారులు ఎక్కువగా వీటినే విక్రయిస్తున్నారు. బాటిళ్లలో నీటిని నింపి రూ.10 నుంచి రూ. 15 దాకా విక్రయిస్తున్నారు. ప్రత్యేకంగా ప్లాస్టిక్ బాటిళ్ల విక్రయించే ఏజెన్సీలు వెలుస్తున్నాయి. నాసిరకం బాటిళ్లతో దాహం తీర్చుకుంటున్న జనానికి ప్లాస్టిక్ అణువుణువూ చేరిపోయి అనారోగ్యాల్ని పెంచుతోంది. ఫలితంగా క్యాన్సర్ వంటి భయానక వ్యాధులకు కారణమవుతున్నాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. కలుషిత నీటితో కలరా, టైఫాయిడ్, హెపటైటిస్-ఏ అమీబియా థైరాయిడ్, చర్మ వాధులు వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

ప్లాస్టిక్ బాటిళ్లలో నీటిని అమ్మితే కేసులు

మార్గదర్శకాలను పాటించకుండా ప్లాస్టిక్ బాటిళ్లల్లో నీటిని నింపి విక్రయించే వారిపై కేసులు నమోదు చేస్తాం. శుద్ధిజల ప్లాంట్లపై పంచాయతీ, నగర, మున్సిపాటీల్లో తనిఖీ చేసే అధికారం వారికే ఉంటుంది. ఇటీవల తనిఖీల్లో ఖాళీ ప్లాస్టిక్ బాటిళ్లు తీసుకువచ్చి నీటిని నింపి విక్రయాలు చే స్తు న్న ట్లు గుర్తించాం, కదిరిలో తనిఖీలు చేపట్టి వాటర్ బాటిళ్ల నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడంతో కేసు నమోదు చేశాం. జిల్లా వ్యాప్తంగా తనిఖీలు చేపడుతున్నాం.



- రామచంద్ర, ఆహార భద్రత శాఖ జిల్లా అధికారి

నీటి పరీక్షలు ఏవీ..?

తాగునీరు శుభ్రంగా ఉందా, కలుషితమవుతోందా అన్న విషయాలను నీటి పరీక్షలు చేపట్టి ప్రజారోగ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత జిల్లా యంత్రాంగంపై ఉంది. నీటి శుద్ధిజల ప్లాంట్లు నుంచి వాటర్ బాటిళ్ల విక్రయాలు జరిపే దుకాణాల దాకా నీటి సమూనాలు సేకరించి ప్రయోగశాలలకు తీసుకెళ్లి హానికరమైన బ్యాక్టీరియా ఇతర క్రిములైనా ఉన్నాయా అని పరీక్షలు చేయించాలి. నీటిలో ఆమ్లం, క్లోరిన్, బురద ఇతర మలినాలు, నైట్రేట్, సల్ఫేట్, ఫ్లోరైడ్ శాతం నిర్దేశిత ప్రమాణాలకు లోబడి ఉన్నాయా, పెరిగాయా అనేది పరీక్షించాలి. జిల్లాలో నీటి సమూనాల సేకరించే నాథుడే కనిపించలేదు. పేద, మధ్య తరగతి ప్రజలు ప్లాంట్ల నుంచి నీళ్లు కొంటూ అనారోగ్యాన్ని తెచ్చుకుంటున్నారు.

కదిరి చైర్‌పర్సన్ ఎంపికపై ఉత్కంఠ



జనరల్ మహిళకు రిజర్వ్

రేసులో ముందున్న ముస్లిం మహిళాసభ్యులు

కౌన్సిలర్ల నుంచి అభిప్రాయ సేకరణ

వైస్ చైర్మన్ పదవులకు తీవ్ర పోటీ

పీఠం ఎవరిదో..?

కదిరి, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీకి కాబోయే చైర్‌పర్సన్ ఎవరు అంటూ నియోజకవర్గ వ్యాప్తంగా పెద్దఎత్తున చర్చ సాగుతోంది. చైర్‌పర్సన్ సీటు జనరల్ మహిళకు రిజర్వ్ అయింది. ఈ లెక్కన మహిళకే చైర్‌పర్సన్ సీటు దక్కనుంది. ఈ నేపథ్యంలో కాబోయే చైర్‌పర్సన్ ఎవరన్న దానిపై అనేక చర్చలు నడుస్తున్నాయి. గతంలో టీడీపీ మాట ఇచ్చిన విధంగా మైనారిటీ మహిళకే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఈనేపథ్యంలో చైర్‌పర్సన్ సీటు కోసం మైనారిటీ వర్గానికి చెందిన మహిళా కౌన్సిలర్లు పోటీ పడుతున్నట్లు తెలిసింది. చైర్‌పర్సన్ ఎంపికలో కౌన్సిలర్లకే స్వేచ్ఛ ఇస్తున్నట్లు ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఇప్పటికే ప్రకటించారు. రెండు రోజులుగా కౌన్సిలర్ల నుంచి అభిప్రాయాలు సేకరించే పని టీడీపీలోని ఓ ముఖ్య నాయకుడికి అప్పగించినట్లు సమాచారం. ఆ పని కూడా పూర్తయినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో చైర్‌పర్సన్‌గా ఎవరిని నియమిస్తారని ఉత్కంఠ పట్టణ ప్రజల్లో నెలకొంది. వైస్‌చైర్మన్ పదవులకు కూడా పెద్ద ఎత్తున కౌన్సిలర్లు పోటీ పడుతున్నట్లు సమాచారం.



కదిరి మున్సిపల్ కార్యాలయం

అశావహుల్లో టెన్షన్

మున్సిపల్ చైర్‌పర్సన్ పీఠం కోసం పలువురు మైనారిటీ మహిళా కౌన్సిలర్లు పోటీ పడుతున్నారు. ప్రధానంగా పదో వార్డు సభ్యురాలు దిల్‌షాదున్నీషా, 30వ వార్డు నుంచి గెలిచిన గులాబ్‌జాన్ రేసులో ఉన్నట్లు తెలిసింది. మరి కొంతమంది మైనారిటీ మహిళాకౌన్సిలర్లు పోటీ పడుతున్నట్లు సమాచారం. పోటీలో ఉన్న మహిళా కౌన్సిలర్ల తరఫున వారి భర్తలు మిగిలిన సభ్యులను ప్రసన్నం చేసుకోవడానికి రకరకాల పద్ధతుల్లో ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. అవిశ్వాస తీర్మానంలో టీడీపీకి మద్దతు తెలిపిన పలువురు వైసీపీ కౌన్సిలర్లు పసుపు కండువా కప్పుకోనున్నట్లు సమాచారం. చైర్‌పర్సన్ సీటుకు పోటీ పడుతున్న కొంతమంది కౌన్సిలర్లు కూడా టీడీపీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిసింది.



అభిప్రాయ సేకరణ

మున్సిపాలిటీలోని 36 మంది కౌన్సిలర్లలో 25 మంది అవిశ్వాస తీర్మానంలో చైర్‌పర్సన్ నజీమున్నీషాకు వ్యవతిరేకంగా ఓటు వేశారు. దీంతో నజీమున్నీషా ప ద వి కోల్పోయారు. కొత్త చైర్‌పర్సన్‌ను ఎన్నుకునే పనిని ఎమ్మెల్యే. టీడీపీలోని ఓ ముఖ్య నాయకుడికి అప్పజెప్పారు. ఆ నాయకుడు రెండ్రోజులుగా అదేపనిలో ఉన్నట్లు సమాచారం. అభిప్రాయాలు సేకరించి, ఎమ్మెల్యేకి వివరించనున్నట్లు తెలిసింది. మెజార్టీ కౌన్సిలర్లు.. చైర్‌పర్సన్ ఎంపికను ఎమ్మెల్యే అభిప్రాయానికే వదిలేసినట్లు తెలిసింది.

వైస్‌చైర్మన్ సీట్లకు తీవ్రపోటీ

రెండు వైస్ చైర్మన్ పోస్టులు ఉండడంతో కౌన్సిలర్లలో ఎక్కువమంది వాటి కోసం పోటీపడుతున్నట్లు తెలిసింది. గతంలో వైసీపీ ఒకటి రెడ్డి సామాజికవర్గానికి, మరొకటి ఎస్సీలకు కేటాయించింది. అదే ఫార్ములాను ప్రస్తుతం కూడా కొనసాగిస్తారా, భిన్నంగా ఉంటుందా అన్నది వేచిచూడాలి. రెడ్డి సామాజికవర్గం నుంచి ఇద్దరు కౌన్సిలర్లు కూటమిలో ఉన్నారు. ఎస్సీలు ఒకరు ఉండగా, బీసీలు అనేకమంది ఉన్నారు. వీరిలో ఏ సామాజికవర్గానికి వైస్ చైర్మన్ పదవులు దక్కుతాయోనన్న టెన్షన్ నెలకొంది.

రెండోసారి..

కదిరి మున్సిపాలిటీలో రెండోసారి టీడీపీ జెండా ఎగురనుంది. గతంలో ఓసారి టీడీపీ గెలిచింది. ఐదేళ్లపాటు టీడీపీ చైర్‌పర్సన్‌గా సురయాభాను కొనసాగారు. ప్రస్తుతం ఎన్నికలు ఇంకా సంవత్సరం ఉన్నప్పటికీ చైర్‌పర్సన్ నజీమున్నీషాపై అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో టీడీపీ మరోసారి మున్సిపాలిటీలో జెండాను ఎగురవేయనుంది.

గాండ్లపెంట విద్యార్థులకు స్వర్ణాలు



స్వర్ణ పతకాలు సాధించిన విద్యార్థులు

గాండ్లపెంట, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి కూడో (మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్) పోటీల్లో గాండ్లపెంట విద్యార్థులు సత్తాచాటారు. ఏకంగా స్వర్ణ పతకాలు సాధించి, జాతీయ స్థాయికి ఎంపికయ్యారని పీడీ హరిప్రసాద్ ఆదివారం తెలిపారు. విశాఖలో మూడురోజులుగా నిర్వహించిన ఏపీ కూడో గేమ్స్ అండర్-14 విభాగంలో గాండ్లపెంట ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు లోకేశ్వరి, నాగవర్ధన్, పురుషోత్తమరెడ్డి స్వర్ణ పతకాలు కైవసం చేసుకున్నారన్నారు. తద్వారా మే 24న మహారాష్ట్రలోని పుణెలో నిర్వహించే జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. విద్యార్థులను టీచర్లు, గ్రామస్థులు అభినందించారు.

ఫిష్ ఆంధ్ర పేరుతో వైసీపీ దోపిడీ

- చంద్రబాబుతోనే మత్స్యకారులకు న్యాయం
- మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

మడకశిర టౌన్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): ఫిష్ ఆంధ్ర పేరుతో వైసీపీ దోపిడీకి పాల్పడిందని మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు మండిపడ్డారు. రూ.3వేల కోట్లు ఖర్చు పెట్టామని చెప్పుకున్నారనీ, ఒక్క మత్స్యకారుడి కుటుంబమయినా బాగుపడిందా అని ప్రశ్నించారు. ఆదివారం స్థానిక క్యాంపు కార్యాలయంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామితో కలిసి విలేకరులతో మాట్లాడారు. నూతన ప్రభుత్వం రాకతో మత్స్యకారుల దశ మారిందన్నారు. ఎన్నికల్లో హామీ మేరకు వేట నిషేధ సమయంలో రూ.20వేలు సాయం అందిస్తూ మాట నిలుపుకొన్నామని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే మత్స్యకారులకు న్యాయం జరిగిందని తెలిపారు. సముద్రంలో వేట నిషేధ సమయంలో మత్స్యకారులు ఇబ్బంది పడకూడదన్న ఉద్దేశంతోనే తమ ప్రభుత్వం ఆర్థిక సాయం చేయాలని నిర్ణయించిందన్నారు. 2014-19 సంవత్సరాల మధ్య మత్స్యకారుల సంక్షేమం కోసం రూ.788 కోట్లు ఖర్చు పెట్టిన ఘనత తమ నేత చంద్రబాబుకే దక్కుతుంది అన్నారు. మత్స్యకారులు చేపల వేట సమయంలో మరణిస్తే రూ.10 లక్షల పరిహారం చెల్లిస్తున్నట్లు తెలిపారు. వేటకు వెళ్లే బోట్లకు డీజిల్‌పై రూ.9 సబ్సిడీ ఇస్తున్నామని వివరించారు. వైసీపీ పాలనలో మత్స్యకారులను పూర్తిగా విస్మరించారని, సంక్షేమం అభివృద్ధిని చూసి ఓర్వలేక అసత్య ప్రచారాలు చేస్తున్నారని అన్నారు.

ఫ్యాక్షన్ టెన్షన్..!

గుంతకల్లుకు చిప్పగిరి ఫ్యాక్షన్

సరిహద్దు కావడంతో కార్పణ్యాలకు వేదికగా పట్టణం

20 ఏళ్లయినా నివురుగప్పిన నిప్పులా కక్షలు

గుంతకల్లు శివారు ప్రాంతాలు, రైలు వంతెనలే టార్గెట్

ఎమ్మార్పీఎస్ నేత దారుణ హత్య

7


ఆస్పత్రి ముందు కుటుంబ సభ్యులు, సంఘాల నేతల ధర్నా



ఇన్నోవా వాహనాన్ని ఢీకొట్టిన టిప్పర్

నేడు ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక


పుట్టపర్తిటౌన్, ఏప్రిల్27(ఆంధ్రజ్యోతి): స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ టీఎస్ చేతన్ ప్రకటనలో తెలిపారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కార్యక్రమం ఉంటుందన్నారు. ప్రజలు తమ సమస్యలపై అర్జీలు ఇచ్చుకోవచ్చన్నారు.



గుడిబండ కొండపై చిరుత


గుడిబండ కొండపై చిరుతలు

గుడిబండ, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం సమీపంలోని గుడిబండ కొండలో రెండు చిరుతలు ఆదివారం కనిపించాయి. మండల కేంద్రానికి ఆనుకునే కొండ ఉండడంతో జనం భయాందోళనలకు లోనవుతున్నారు. కొండలో వారం రోజులుగా చిరుతలు సంచరిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. శని, ఆదివారాల్లో కోట గోడలపై కనిపించాయి. చిరుతలను బంధించి, తమకు రక్షణ కల్పించాలని గుడిబండ వాసులు కోరుతున్నారు.



ఫ్యాక్షన్ టెన్షన్..!

- గుంతకల్లుకు చిప్పగిరి ఫ్యాక్షన్
- సరిహద్దు కావడంతో కార్పణ్యాలకు వేదికగా పట్టణం
- 20 ఏళ్లయినా నివురుగప్పిన నిప్పులా కక్షలు
- గుంతకల్లు శివారు ప్రాంతాలు, రైలు వంతెనలే టార్గెట్



గుంతకల్లు, ఏప్రిల్27(ఆంధ్రజ్యోతి): ఫ్యాక్షన్ కర్నూలు జిల్లా చిప్పగిరి మండలానికి చెందినదే అయినా, హత్యలకు గుంతకల్లు పట్టణం వేదికగా మారింది. ఫ్యాక్షన్ గ్రామంలో వైరివర్గాలు అప్రమత్తంగా ఉంటూ శత్రువుల కదలికలపై నిఘా పెట్టి జాగ్రత్తలు పాటిస్తుండటంతో, పగ తీర్చుకోవడానికి బయటి ప్రాంతాలనే ఎంచుకుంటూ 40 ఏళ్లలో రక్తపుటేర్లను పారించారు. గుంతకల్లుకు శివారు గ్రామంగా చిప్పగిరి ఉండటంతో గ్రామస్థులు ప్రతి చిన్న విషయానికీ గుంతకల్లుకు వస్తుంటారు. ఆస్పత్రులు, కోర్టు కేసుల కోసం గుంతకల్లుకు రావాల్సిన పరిస్థితులుండటంతో ఫ్యాక్షన్ హత్యలకు గుంతకల్లు వేదికగా మారింది. గుంతకల్లు శివారులో 2000లో బెల్దోన అశోక్ హత్య సంచలనం రేపింది. ఇప్పుడు చిప్పగిరి లక్ష్మీనారాయణ హత్యతో గుంతకల్లు ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. లక్ష్మీనారాయణది ఫ్యాక్షన్ హత్యా, అతడి ఇతర శత్రువుల పన్నాగమా అనే విషయం బహిర్గతం కావాల్సి ఉంది. ఫ్యాక్షన్ హత్యల్లో నిందితుడిగా ఉన్న లక్ష్మీనారాయణ మృతి స్థానికంగా మరెన్ని అనర్థాలకు దారితీస్తుందోనని గుంతకల్లు ప్రజలను టెన్షన్‌కు గురిచేస్తోంది.

రెండు తరాలుగా హత్యలు..

చిప్పగిరి కేంద్రంగా ఏర్పడిన కక్షలు, కార్పణ్యాలు గుంతకల్లులో రక్తపుటేరులను పారించాయి. చిప్పగిరి మండలం రాజకీయంగా టీడీపీకి వ్యూహాత్మక ప్రాంతం. ఇక్కడ మెజారిటీ సాధించిన పార్టీ అభ్యర్థే ఎంపీగా గెలుపొందే అవకాశం ఉంది. చిప్పగిరి మండలంలో వైకుంఠం శ్రీరాములు టీడీపీలో పట్టున్న నాయకుడు. శ్రీరాములును బలహీనపరిస్తే తప్ప.. కాంగ్రెస్ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు గెలవలేరన్న కారణంగా ఆ పార్టీ నేతలు ఈ మండలంపై ప్రత్యేక దృష్టి పెట్టారు. శ్రీరాములు కాంగ్రెస్‌లోకి రాడని నిర్ధారించుకుని అతడి సమీప బంధువులను కాంగ్రెస్‌లోకి తెచ్చారు. బెల్దోన అశోక్‌కు తన గ్రామంలోనే బలమైన మరో వర్గంతో శత్రుత్వం ఏర్పడింది. దాంతో 80వ దశకంలో ఆధిపత్యపోరు ఫ్యాక్షన్ రూపం దాల్చింది. గుంతకల్లు పట్టణంలోని పాత బస్టాండు వద్ద చిప్పగిరి నారాయణ అనే వ్యక్తిపై బాంబు వేసి, ప్రత్యర్థులు హతమార్చారు. ఈ నేపథ్యంలో గుంతకల్లు శివారులోని ఆలూరు రోడ్డు రైలు వంతెన వద్ద కొందరు కాపుకాచి బైక్‌పై వస్తున్న బెల్దోణ ప్రభాకర్, వెంకటేశులుపై బాంబులు విసిరి చంపేశారు. అలాగే గుంతకల్లు పట్టణంలోని వాసవీ కల్యాణమండపం ఎదుట వైకుంఠం నారాయణ స్వామి అనే వ్యక్తిని హత్య చేశారు. తర్వాత గుంతకల్లు శివారు బళ్లారి రోడ్డులో బెల్దోణ అశోక్ కారును జీపుతో ఢీకొట్టి, తుపాకీతో పేల్చి చంపారు. గుంతకల్లు మండలం ఎన్ తిమ్మాపురంలో టీచరుగా పనిచేస్తున్న కావలి శ్రీనివాసులును దారికాచి చంపారు. ఆ తర్వాత కొన్నాళ్లకే నల్ల ఆంజనేయులు అనే వ్యక్తిని దౌల్తాపురం రైలు వంతెన వద్ద కాపుకాచి ప్రతీకార హత్యచేశారు. అశోక్ హత్యకు ప్రతీకారంగా 2006లో చిప్పగిరి టీడీపీ నాయకుడైన వైకుంఠం శ్రీరాములు, ఆయన భార్య శకుంతలమ్మను ప్రత్యర్థులు ఇంటిపైకే దాడికి వెళ్లి హత్యలు చేశారు. ఆ ఘటనతో గుంతకల్లుకు ఫ్యాక్షన్ పాకుతుందేమోనని ఆందోళనలు వ్యక్తమయ్యాయి. అప్పటి నుంచి గుంతకల్లు ప్రాంతంలో చిప్పగిరి కేంద్రంగా ఇక్కడ హత్యలు జరగలేదు. తాజాగా గుంతకల్లు శివారులోని ఆలూరు రోడ్డుపై రైలు వంతెన వద్ద చిప్పగిరి లక్ష్మీనారాయణను హత్య చేయడంతో మరలా ఈ ప్రాంతంలో భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి.

హత్య భయం ఉన్నా..

టీడీపీ మాజీ నాయకుడు వైకుంఠం శ్రీరాములు, ఆయన భార్య శకుంతలమ్మ 2006లో హత్యకు గురయ్యాక ఆ కేసులో ఏ-7గా ఉన్న చిప్పగిరి లక్ష్మీనారాయణ ఇంటి వద్ద పోలీసు పికెట్ ఏర్పాటుచేశారు. లక్ష్మీనారాయణపై హత్యా ప్రయత్నం జరిగే అవకాశం ఉన్నందున పోలీసులు ప్రత్యేక రక్షణ కల్పించారు. ఈ నేపథ్యంలో రైల్వే టెండరు కోసం గుంతకల్లుకు వచ్చిన లక్ష్మీనారాయణ వద్ద ఆయుధాలున్నట్లు తెలియడంతో స్థానిక వన్‌టౌన్ పోలీసులు స్టేషన్‌కు తీసుకెళ్లి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ నేపథ్యంలో మూడు నెలల క్రితం చిప్పగిరిలో పోలీసు పికెట్‌ను తొలగించారు. ఈ నిర్ణయంలో ఓ పోలీసు అధికారి హస్తం ఉందంటూ లక్ష్మీనారాయణ ఇటీవల ఆరోపణలు చేశారు. ప్రత్యర్థుల నుంచి లక్ష్మీనారాయణకు ప్రాణ భయం ఉన్నా పంచాయితీలకు వెళ్లేవాడని సమాచారం. ఈ విషయంగా కొన్ని ఘర్షణలూ జరిగాయి. ఈ పరిస్థితుల్లో లక్ష్మీనారాయణ హత్యకు గురికావడం చర్చనీయాంశంగా మారింది. ఇది ఫ్యాక్షన్ హత్యా, ఇది పంచాయితీల కారణంగా ఏర్పడిన శత్రుత్వాల వల్ల జరిగిన ఘటనా? అన్న దానిపై సందిగ్ధత నెలకొంది. విచారణ చేపట్టిన పోలీసులు వివరాలను వెల్లడించాల్సి ఉంది.

ఎమ్మార్పీఎస్ నేత దారుణ హత్య

- టిప్పర్‌తో ఢీకొట్టి కొడవళ్లతో నరికిన దుండగులు
- మృతుడు కాంగ్రెస్ ఆలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి కూడా..



హత్యకు గురైన చిప్పగిరి లక్ష్మీనారాయణ



రోదిస్తున్న లక్ష్మీనారాయణ కుటుంబసభ్యులు

గుంతకల్లు/గుంతకల్లుటౌన్, ఏప్రిల్27(ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ రాయలసీమ అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ కర్నూలు జిల్లా ఆలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి చిప్పగిరి లక్ష్మీనారాయణ (60) హత్యతో గుంతకల్లు ఉలిక్కిపడింది. ఆయనను పట్టణ శివారులో దుండగులు టిప్పర్‌తో ఢీకొట్టి, కొడవళ్లతో నరికి చంపారు. కర్నూలు జిల్లా చిప్పగిరి మండల కేంద్రానికి చెందిన లక్ష్మీనారాయణ ఆదివారం ఉదయం కుమారుడు వినోద్‌కుమార్, సమీప బంధువు గోవిందుతో కలిసి గుంతకల్లుకు వచ్చారు. మధ్యాహ్నం ఇన్నోవా వాహనంలో చిప్పగిరికి బయల్దేరారు. గుంతకల్లు-ఆలూరు రహదారిలో పట్టణ శివారులోని రైలు వంతెన సమీపాన స్పీడ్ బ్రేకర్ వద్ద ఇన్నోవా వాహనాన్ని టిప్పర్‌తో ఎదురుగా వచ్చి దుండగులు ఢీకొట్టారు. దుండగులు వెంటనే లక్ష్మీనారాయణను బయటకు లాగి, కొడవళ్లతో అతడి తల, వీపు మీద నరికారు. తర్వాత కారులో పరారయ్యారు. స్థానికులు వెంటనే చిప్పగిరి లక్ష్మీనారాయణ, వినోద్‌కుమార్, గోవిందును గుంతకల్లు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి లక్ష్మీనారాయణ చనిపోయినట్లు నిర్ధారించారు. సమాచారం అందుకున్న మృతుడి కుటుంబ సభ్యులు, చిప్పగిరి గ్రామస్థులు పెద్దఎత్తున గుంతకల్లు ప్రభుత్వాస్పత్రికి చేరుకున్నారు. లక్ష్మీనారాయణకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

ఆస్పత్రి ఎదుట ధర్నా

చిప్పగిరి లక్ష్మీనారాయణను హత్యచేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ ఎమ్మార్పీఎస్, దళిత సంఘాల నాయకులు, మృతుడి కుటుంబసభ్యులు డిమాండ్ చేశారు. స్థానిక ప్రభుత్వాస్పత్రి ఎదుట ఆదివారం సాయంత్రం ధర్నా నిర్వహించారు. నిందితులను వెంటనే అరెస్టు చేయాలనీ, పత్తికొండ డీఎస్పీపై విచారణ జరిపించాలని నినాదాలు చేశారు. ఎస్పీ వచ్చి హామీ ఇచ్చేవరకు ధర్నా విరమించే ప్రసక్తేలేదని భీష్మించారు. రెండు గంటలపాటు ధర్నా చేయడంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. పోలీసులు వాహనాలను దారి మళ్లించారు. ఎమ్మార్పీఎస్ నాయకుడు ఆనంద్ ఒంటిపై పెట్రోల్ పోసుకుని, నిప్పటించుకునేందుకు యత్నించారు. అక్కడే ఉన్న నాయకులు.. అతడిపై నీళ్లు పోశారు. ఆస్పత్రి వద్దకు డీఎస్పీ శ్రీనివాస్ చేరుకుని, ధర్నా విరమించాలని సూచించారు. ఎస్పీతో ఫోన్‌లో మాట్లాడించారు. ఎస్పీ రావాల్సిందేనని పట్టుబట్టారు. దీంతో ఎస్పీ జగదీష్ ఆస్పత్రి వద్దకు చేరుకుని, మృతుడి కుటుంబ సభ్యులు, ఎమ్మార్పీఎస్, దళిత సంఘాల నాయకులతో మాట్లాడారు. నిందితులను అరెస్టు చేసి, తమకు న్యాయం చేయాలని లక్ష్మీనారాయణ కుటుంబసభ్యులు కోరారు. ఎస్పీ మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా అలర్ట్ చేశామనీ, 24 గంటల్లో హత్యకేసు నిందితులను పట్టుకుంటామని చెప్పారు. దీంతో ధర్నా విరమించారు. అనంతరం హత్యాస్థలాన్ని ఎస్పీ పరిశీలించారు. డీఎస్పీని అడిగి వివరాలు తెలుసుకున్నారు.



ఆస్పత్రి ఎదుట ధర్నా చేస్తున్న ఎమ్మార్పీఎస్, దళిత సంఘాల నాయకులు

క్రైం కార్నర్

విద్యుదాఘాతంతో కౌలు రైతు మృతి



శ్రీరామ్ (ఫైల్)

బొమ్మనహాళ్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని దర్గాహొన్నూరు గ్రామానికి చెందిన కౌలు రైతు శ్రీరామ్(33) విద్యుదాఘాతంతో మృతిచెందాడు. గ్రామస్థులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అదే ఊరికి చెందిన ఆనందరెడ్డికి చెందిన ఆరెకరాల భూమిని శ్రీరామ్ కౌలుకు తీసుకుని, పంటలు సాగు చేస్తుండేవాడు. వారం రోజుల క్రితం సజ్జ పంట పెట్టాడు. శనివారం అర్ధరాత్రి పంటకు నీరు పెట్టేందుకు వెళ్లాడు. అప్పటికే మోటారుకు విద్యుత్ సరఫరా అవుతుండడంతో దానిని తాకిన శ్రీరామ్ షాక్ తగిలి, మరణించాడు. చుట్టుపక్కల పొలాల రైతులు గమనించి, కుటుంబీకులకు సమాచారం అందించారు. కుటుంబీకులు తోటలోకి చేరుకుని, బోరున విలపించారు. మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లారు. రైతుకు భార్య మహాలక్ష్మి, కుమారుడు శీనా, కుమార్తె చందు ఉన్నారు. దీనిపై బొమ్మనహాళ్ పోలీసులను అడగ్గా.. తమకు ఫిర్యాదు అందలేదని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

- 108 ఆలస్యం... ప్రైవేటు వాహనంలో తరలింపు

కూడేరు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముద్దలాపురం గ్రామం వద్దనున్న పెట్రోల్ బంక్ సమీపంలో ద్విచక్రవాహన ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఆదివారం మహేష్, ఫాతిమా, చిన్నారి శ్యామ్ ద్విచక్రవాహనంలో అనంతపురం నుంచి ఉరవకొండకు వెళ్తుండగా.. ముద్దలాపురం దాటిన తర్వాత పెట్రోల్ బంకు వద్ద కుక్క అడ్డు రావడంతో ద్విచక్ర వాహనం ప్రమాదానికి గురయింది. ప్రమాదంలో గాయపడ్డ వారిని 108 వాహనంలో తరలించేందుకు కాల్ సెంటర్‌కు సమాచారం పంపారు. సకాలంలో వాహనం రాకపోవడంతో ప్రైవేటు వాహనంలో తరలించారు. బాధితులు కూడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందారు.

వేడి నీళ్లు పడి చిన్నారి మృతి

హిందూపురం, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): నన్నారి వేర్లు ఉడకబెట్టే సమయంలో ఆ వేడి నీరు పడి చిన్నారి మరణించాడు. మండలంలోని వీవర్స్ కాలనీలో నివాసమున్న జుబేర్ తన ఇంటిలో శనివారం నన్నారి తయారు చేయడానికి వేర్లు ఉడక బెడుతున్నాడు. ఆ సమయంలో అక్కడే ఉన్న జుబేర్ కుమారుడు జాన్(2)పై వేడినీళ్లు పడ్డాయి. తీవ్రంగా గాయపడిన చిన్నారిని హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో బెంగళూరుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

1 నుంచి ఉచిత శిక్షణ

అనంతపురం విద్య, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల నేపథ్యంలో మే 1 నుంచి విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా జవహర్ బాల భవన్ ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ ప్రమీల ఆదివారం ప్రకటనలో తెలిపారు. 1వ తేదీ నుంచి జూన్ 12 వరకూ ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకూ చిత్రలేఖనం, టైలరింగ్‌పై శిక్షణ ఉంటుందన్నారు. 6 ఏళ్ల నుంచి 18 ఏళ్లలోపు విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ముగ్గురు 'ఉపాధి' సిబ్బంది అరెస్టు

విడపనకల్లు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం పనుల్లో అవినీతి అక్రమాలకు పాల్పడిన ముగ్గురు ఉద్యోగులను అరెస్టు చేసినట్లు విడపనకల్లు ఎస్ఐ ఖాజా హుస్సేన్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మండలంలోని వివిధ గ్రామాల్లో 2023-24 సంవత్సరంలో జరిగిన ఉపాధి హామీ పనుల్లో కొంత మంది సిబ్బంది నకిలీ జాబ్ కార్డులను సృష్టించి పనులు చేయకున్నా చేసినట్లు బిల్లులు ఖాజేశారని తెలిపారు. ఈ విషయమై విడపనకల్లు ఎంపీడీఓ షకీలాబేగం ఫిర్యాదు మేరకు ఫిబ్రవరి 8వ తేదీన 8 మంది ఉపాధి హామీ సిబ్బందిపై క్రిమినల్ కేసులు నమోదు చేశామన్నారు. వీరిలో కంప్యూటర్ ఆపరేటర్ సుభాన్, కరకముక్కల ఫీల్డ్‌అసిస్టెంట్ రామస్వామి, పాల్తూరు ఫీల్డ్ అసిస్టెంట్ గురుస్వామిని శనివారం విడపనకల్లులో అరెస్టు చేశామన్నారు. వీరిని ఉరవకొండ మండల తహసీల్దారు, మండల మేజిస్ట్రేట్ మహబూబ్ బాషా ముందు హాజరు పరచగా వీరికి ఏడు రోజులు రిమాండ్ విధిస్తూ ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. దీంతో నిందితులను బుక్కరాయసముద్రం మండలం రెడ్డిపల్లిలోని జిల్లా జైలుకు తరలించామని పేర్కొన్నారు.

మిగిలిన వారి సంగతేంటి..?

ఫిర్యాదుల దినోత్సవంలో పాత ఎంపీడీఓ శ్రీనివాసులుపై ఆధారాలతో ఆర్థిక శాఖ మంత్రికి ఫిర్యాదు చేసినా క్రిమినల్ కేసులు నమోదు చేయకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఉపాధిహామీ పనుల్లో దాదాపుగా రూ. 1.19 కోట్ల అవినీతి జరిగిందని, పంచాయతీల్లో రోడ్లు వేయకున్నా వేసినట్లు ఎం.బుక్‌లు రికార్డులు చేసి బిల్లులు కాజేశారని ఆధారాలతో ఫిర్యాదు చేశారు. డ్వామా అధికారులు మాత్రం రూ.18.36 లక్షలు మాత్రమే అవినీతి జరిగిందని, ఎనిమిది మంది ఉపాధి హామీ సిబ్బందిపై క్రిమినల్ కేసులు నమోదు చేయించారు. రికవరీ జాబితాలో పాత ఎంపీడీఓ(పీఓ) శ్రీనివాసులు మొదట ఉన్నా.. ఆయన్ను మాత్రం వదిలేసి మిగిలిన వారిపై కేసులు నమోదు చేయించారు. దీంతో కొంత మంది ప్రజలు ఈ నెల 8న విడపనకల్లులో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎంపీడీఓ అవినీతి అక్రమాలపై ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌కు ఫిర్యాదు చేశారు. స్వయంగా మంత్రి డ్వామా అధికారులను పిలిచి విచారించి ఎంపీడీఓపై వెంటనే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆదేశించినా.. జిల్లా అధికారులు కేసును నీరుగార్చేలా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. మిగిలిన ఐదుగురిని అరెస్టు చేస్తారా? లేక వదిలేస్తారా అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఎంపీడీఓపై క్రిమినల్ కేసు నమోదు చేయకుండా జిల్లా అధికారులే వెనుకేసుకొస్తున్నట్లు చర్చలు జరుగుతున్నాయి.

పెనుకొండకు జిల్లా కోర్టు

- జిల్లా న్యాయాధికారి భీమ్‌రావు



జిల్లా న్యాయాధికారికి స్వాగతం పలుకుతున్న ఆర్డీఓ ఆనంద్‌కుమార్

పెనుకొండ టౌన్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): అన్ని వసతులున్న పెనుకొండకు జిల్లా కోర్టు రానుందని, ఆ మేరకు కావాల్సిన ఏర్పాట్లు చేయాలని జిల్లా న్యాయాధికారి భీమ్‌రావు పేర్కొన్నారు. ఆదివారం పెనుకొండకు వచ్చిన జిల్లా న్యాయాధికారికి సీనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి వాసుదేవన్, జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి బొజ్జప్ప, అదనపు జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి ముజీబ్ పసపల సయ్యద్, ఆర్డీఓ ఆనంద్‌కుమార్ పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయాధికారి స్థానిక అధికారులతో కలిసి జిల్లా కోర్టుకు కావాల్సిన సముదాయం, కోర్టు ప్రాంగణాన్ని పరిశీలించారు. అనంతరం పలు ప్రాచీన దేవాలయాలు సందర్శించారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గ సభ్యులు

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): పశుసంవర్ధక శాఖ ఉద్యోగుల సంఘం ఉమ్మడి అనంత జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక పశుసంవర్ధక శాఖ జేడీ కార్యాలయంలో ఆదివారం ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పార్థసారధి రెడ్డి పర్యవేక్షణలో జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా ఏడీ రామచంద్రారెడ్డి, ఉపాధ్యక్షులుగా ప్రసన్నబాయి, కార్యదర్శిగా మల్లేష్ గౌడ్, కోశాధికారిగా జీఎస్ అమర్, సహాయ కార్యదర్శిగా ఖదీర్ బాషా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ సభ్యులు.. అనంత, శ్రీసత్యసాయి జిల్లాల పశుసంవర్ధక శాఖ జేడీలు వెంకటస్వామి, సుభదాస్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. నూతన కార్యవర్గానికి పలువురు అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

నిరుద్యోగులకు కంప్యూటర్ శిక్షణ

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని నిరుద్యోగ యువతీయువకులకు కంప్యూటర్‌లో ఉచిత శిక్షణ ఇచ్చి, ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ మల్లారెడ్డి ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఎకాలజీ సెంటర్‌లో 45రోజుల పాటు కంప్యూటర్‌లో శిక్షణ, అనంతరం ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. 20-35 సంవత్సరాల మధ్య వయసు కలిగి ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, ఇంజనీరింగ్ చదివిన అభ్యర్థులు అర్హులన్నారు. మే 1వ తేదీ నుంచి శిక్షణ ప్రారంభిస్తామని తెలిపారు. ఆసక్తి, అర్హతగల నిరుద్యోగులు వెంటనే ఎకాలజీ సెంటర్‌లో పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.

రచనలకు శారీరకలోపం అడ్డు కాదు

- ఆచార్య బాలసుబ్రహ్మణ్యం

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): సాహిత్య రచనలకు శారీరక లోపం అడ్డు కాదని 'స్వాతి చినుకు' నవలా రచయిత పీజీ వెంకటేష్ నిరూపించారని ఎస్కేయూ ఆచార్యులు బాలసుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. కవి పీజీ వెంకటేష్ రచించిన 'స్వాతి చినుకు', 'మన ప్రభుత్వాధినేతలు' పుస్తకాల ఆవిష్కరణ సభను తెలుగు వెలుగు సాహిత్య సామాజిక సేవాసంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఉపాధ్యాయ భవన్‌లో నిర్వహించారు. ఆచార్య బాలసుబ్రహ్మణ్యం ముఖ్యఅతిథిగా హాజరై పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పుస్తకం రాయడమంటే కేవలం హస్తభూషణమే కాదు, మనో భూషణం, మేధో భూషణం కూడా అని వెంకటేష్ రుజువు చేశారని అన్నారు. స్త్రీలు ఎదుర్కొంటున్న సమస్యల పట్ల అవగాహన ఉంది కాబట్టే రచయిత 'స్వాతిచినుకు' నవల రాయగలిగారని, అలాగే 'మన ప్రభుత్వాధినేతలు' పుస్తకంలో నేతలు, రాష్ట్రాల సంక్షిప్త సమాచార గ్రంథంగా వెలువరించడం అభినందనీయమన్నారు. తెలుగు వెలుగు సాహిత్య సామాజిక సేవాసంస్థ అధ్యక్షుడు టీవీ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆచార్య ఏవీ రమణ, సీనియర్ కవి తూముచెర్ల రాజారాం, విశ్రాంత ప్రిన్సిపాల్ రంగస్వామి, జిరసం అధ్యక్షుడు కొత్తపల్లి సురేష్, అంకె శ్రీనివాస్, ట్రినిటి మానసిక వికలాంగుల పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాజామణి, అంకె రామలింగయ్య, గోసల నారాయణస్వామి, మధురశ్రీ పాల్గొన్నారు.



స్వాతి చినుకు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీకారులు

హ్యాండ్‌బాల్‌లో శ్రీసత్యసాయి జట్టు ప్రతిభ

- రాష్ట్రస్థాయి టోర్నీలో మూడో స్థానం కైవసం



ట్రోఫీతో శ్రీసత్యసాయి జిల్లా జట్టు

కదిరిఅర్బన్, ఏప్రిల్27(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా కదిరి పట్టణంలోని శ్రీతాయి సూర్యనారాయణ (ఎస్‌టీఎస్‌ఎన్) డిగ్రీ కళాశాల క్రీడామైదానంలో నిర్వహించిన 54వ రాష్ట్రస్థాయి సీనియర్ పురుషుల హ్యాండ్‌బాల్ పోటీల్లో ఆతిథ్య జట్టు ప్రతిభ చాటింది. రెండ్రోజులపాటు సాగిన ఈ పోటీలు ఆదివారం ముగిశాయి. మూడోస్థానం కోసం నిర్వహించిన మ్యాచ్‌లో ఆతిథ్య శ్రీసత్యసాయి జిల్లా, విజయనగరం జట్లు తలపడ్డాయి. శ్రీసత్యసాయి జిల్లా జట్టు 20-12 తేడాతో గెలుపొందింది, మూడోస్థానంలో నిలిచింది. టోర్నీలో కర్నూలు జిల్లా జట్టు చాంపియన్‌గా అవతరించింది. ఫైనల్ మ్యాచ్‌లో కర్నూలు, పశ్చిమగోదావరి జట్లు తలపడ్డాయి. కర్నూలు జట్టు 22-13 పాయింట్ల తేడాతో గెలిచి, ట్రోఫీని సొంతం చేసుకుంది. పశ్చిమగోదావరి జిల్లా జట్టు రన్నరప్‌తో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. అనంతరం విజేత జట్లకు కెనరా బ్యాంకు మేనేజర్ విజయకుమార్, పేబ్యాక్ సంస్థ అధ్యక్షుడు ధనుంజనాయుడు ట్రోఫీలు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తులు

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): 2024-25 విద్యాసంవత్సరంలో పదో తరగతి, ఇంటర్‌లో ఉత్తమ మార్కులు సాధించిన రజక విద్యార్థులు ప్రతిభాపురస్కారాలకు దరఖాస్తు చేసుకోవాలని రజక ఉద్యోగ విద్యావంతుల సంక్షేమ సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు కమ్మన్న, అధ్యక్షప్రధాన కార్యదర్శులు రంగనాథ్, శ్రీహరి ఆదివారం ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ప్రభుత్వ పాఠశాలలో చదివి 450, ప్రైవేటు పాఠశాలల్లో 480 మార్కులు సాధించిన రజక విద్యార్థులు అర్హులన్నారు. ఇంటర్మీడియట్‌లో సైన్సులో 800, ఆర్ట్స్‌లో 700 మార్కులకుపైగా వచ్చిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అర్హులైన రజక విద్యార్థులు మార్కుల జాబితా, కులధృవీకరణ పత్రం, ఆధార్ కార్డు, ఫోన్ నంబర్లతో రజకనగర్‌లోని చిరునామాలో మే 15వతేదీలోపు దరఖాస్తులు అందజేయాలన్నారు. వివరాలకు 9440501188, 9491871141, 8121777065, 9441698409 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

న్యూస్ బాక్స్

సూర్యభగవానుడి అలంకరణలో త్రిలింగేశ్వరుడు



ధర్మవరంరూరల్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): స్థానిక బసవన్నకట్ట వీధిలోని పురాతన త్రిలింగేశ్వరుడు ఆలయంలో ఆదివారం ఆలయ అర్చకుడు రాఘవశర్మ స్వామివారి లింగానికి సూర్యభగవానుడి, రుద్రాలతో అలంకరించారు. అభిషేకాలు, అర్చనలు, సూర్య అష్టోత్తరనామాల వేదమంత్రాలతో ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం స్వామి ఆలయం ముందు మహిళలు దీపాలు వెలిగించారు.

రీసర్వేపై గ్రామసభ

కొత్తచెరువు ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని మరకుంటపల్లి గ్రామంలో రీసర్వే ప్రాజెక్టు గ్రామసభను ఆర్డీటీ పాఠశాలలో ఆదివారం నిర్వహించారు. ఆర్డీఓ సువర్ణ మాట్లాడుతూ.. మే ఒకటి నుంచి ఈ గ్రామంలోని భూములను రెవెన్యూ అధికారులు రీసర్వే చేస్తారని, రీసర్వేకు వచ్చే రెవెన్యూ అధికారులకు, సిబ్బందికి రైతులు వారివారి భూముల సరిహద్దులు చూపించాలని సూచించారు. అధికారులకు రైతులు అందుబాటులో ఉండి రీసర్వే చేయించుకోవాలన్నారు. అప్పుడే రీసర్వేలో ఎలాంటి పొరపాట్లు జరగవన్నారు. రీసర్వే రోజున రైతులు అందుబాటులో లేకపోతే ఇబ్బందులు పడతారన్నారు. కార్యక్రమంలో డీటీ బాలరామాంజినేయులు, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రేపట్నుంచి వేసవి విజ్ఞాన శిబిరాలు

కొత్తచెరువు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని ఈ నెల 29 నుంచి జూన్ 6 తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి జయరాం ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజు ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు ఈ శిబిరాన్ని నిర్వహిస్తామని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలి



మాట్లాడుతున్న ఆవాజ్ కమిటీ సభ్యులు

ముదిగుబ్బ, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లో ఉగ్రదాడులకు పాల్పడ్డ వారిని కఠినంగా శిక్షించాలని సీపీఎం ఆవాజ్ కమిటీ మండల ప్రధాన కార్యదర్శి బాబ్జాన్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన స్థానిక మీడియాతో మాట్లాడుతూ.. ఉగ్రవాదులు ఏ మతస్థులైనా.. ఏ దేశస్థులైనా కేంద్ర ప్రభుత్వం కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో ఆవాజ్ కమిటీ సభ్యులు టైలర్ ముస్తఫా, చికెన్ రఫీ, బాబాఫకృద్దీన్, అల్లాబకాష్, పక్కీరప్ప పాల్గొన్నారు.

5న కలెక్టరేట్ ఎదుట ధర్నా: సీపీఎం



ధర్మవరంలో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

ధర్మవరంరూరల్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు పరిష్కరించాలని మే ఐదో తేదీన కలెక్టరేట్ ఎదుట మహాధర్నా నిర్వహిస్తున్నామని, ప్రజలంతా పాల్గొని జయప్రదం చేయాలని సీపీఎం నాయకులు కోరారు. ఆదివారం స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో జిల్లా కమిటీ సభ్యుడు జంగాలపల్లి పెద్దన్న, సీనియర్ నాయకుడు ఎస్‌హెచ్ బాషా మాట్లాడారు. నిరుపేదలకు ఇళ్లను మంజూరు చేయాలని, పట్టణ, గ్రామాలకు శ్మశాన వాటికలకు స్థలాలు కేటాయించాలని, మడకశిర, లేపాక్షి ప్రాంతాల్లో పరిశ్రమల పేరుతో స్వాధీనం చేసుకున్న వేల ఎకరాల భూములను అదే రైతులు తిరిగి ఇవ్వాలని, హంద్రీనీవా కాలువలు వెడల్పు చేసి జిల్లాలోని అన్ని చెరువులను నింపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు హైదర్‌వలి, ఎల్ ఆదినారాయణ, మారుతి పాల్గొన్నారు.

● కదిరిఅర్బన్ : అర్హులకు ఇళ్లస్థలాలు ఇవ్వాలని మే 5న కలెక్టరేట్ వద్ద చేపట్టనున్న మహాధర్నాను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఈఎస్ వెంకటేష్ పిలుపునిచ్చారు.



కదిరిలో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

ఆదివారం స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. పేదలకు ఇళ్ల స్థలాలు, టిడ్కో ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసి లబ్ధిదారులకు అప్పగించాలన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాసులు, జీఎల్ నరసింహులు, జగన్మోహన్, సాంబశివ, రామమ్మోహన్, బాబ్‌జాన్ పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ

బత్తలపల్లి, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని రౌడీషీటర్లకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ హేమంత్‌కుమార్ ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. గొడవలకు దూరంగా ఉండి మంచి ప్రవర్తనతో మెలగాలని సూచించారు. గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉందని, ఎవరైనా గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇందులో సీఐ ప్రభాకర్, ఎస్‌ఐలు సోమశేఖర్, గోవిందు, సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న వాహనాల తనిఖీ

పుట్టపర్తిరూరల్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): విజిబుల్ పోలిసింగ్ విధానంలో భాగంగా ఎస్పీ వీ.రత్న ఆదేశాల మేరకు మూడో రోజైన ఆదివారమూ జిల్లావ్యాప్తంగా వాహనాల తనిఖీ కొనసాగింది. ఇందులో భాగంగా పలు ప్రాంతాల్లో రోడ్డుభద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. డ్రంక్ అండ్ డ్రైవ్, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్, పరిమితికి మించి వాహనాల్లో తరలింపు.. తదితర వాటిని గుర్తించి.. జరిమానాలు విధించారు. శక్తియాప్‌పై అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. అర్బన్ సీఐ సునీత పలు వాహనాల రికార్డులను తనిఖీ చేశారు.



ఆటో రికార్డులను పరిశీలిస్తున్న అర్బన్ సీఐ సునీత

సూక్ష్మంలో మోక్షం..!



- బిందు, తుంపర సేద్యంతో సత్ఫలితాలు
- తక్కువ నీటితో ఎక్కువ సాగు
- టీడీపీ హయాంలో సబ్సిడీలతో ప్రోత్సాహం
- అటకెక్కించిన వైసీపీ ప్రభుత్వం
- తీవ్రంగా నష్టపోయిన రైతులు
- కొత్త ప్రభుత్వంలో సూక్ష్మ సేద్యానికి పూర్వ వైభవం
- వినియోగంలో దేశంలోనే జిల్లాకు 10వ స్థానం

ఓబుళదేవరచెరువు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): కరువు జిల్లా .. తరిగిపోయిన భూగర్భ జలాలు .. ఎండిపోయిన బోర్లు.. బావులు.. వర్షాభావం.. తదితర కారణాలతో జిల్లాలో రైతులు వ్యవసాయ జూదంలో చాలా నష్టపోయారు. అప్పుల పాలయ్యారు. దీంతో వేలాది మంది వ్యవసాయ రంగాన్ని వదిలేసి కూలీలుగా మారారు. మరికొందరు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లి.. చిన్న చిన్న పనులు చేసుకొంటూ కాలం వెళ్లదీసేవారు. అ లాంటి స్థితిలో ఉన్న రైతులను ఆదుకునేందుకు 2014-19లో టీడీపీ ప్రభుత్వం బిందు, తుంపర సేద్యాన్ని పరిచయం చేసింది. తక్కువ నీటితో ఎక్కువ సాగు చేసేందుకు అవసరమైన పరికరాలను సబ్సిడీలతో అందజేసి వారిని ఆదుకుంది. ఐదు ఎకరాల లోపు ఉండే ఎస్సీ, ఎస్టీ రైతులకు వందశాతం సబ్సిడీ ఇచ్చింది. దీంతో జిల్లాలో రైతులకు మళ్లీ వ్యవసాయంపై ఆసక్తి పెరిగింది.

● వైసీపీ నిర్లక్ష్యం..

టీడీపీ ప్రోత్సాహంతో అప్పుడప్పుడే ఊపిరి పీల్చుకొంటున్న రైతులు.. వైసీపీ ప్రభుత్వం రాక మరింత తీవ్రంగా నష్టపోయారు. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లు వ్యవసాయ రంగాన్ని తీవ్ర నిర్లక్ష్యం చేసింది. బిందు, తుంపర సేద్యం సబ్సిడీలను ఆపేసింది. దీంతో వ్యవసాయ రంగంలో మళ్లీ చీకట్లు కమ్ముకున్నాయి. సబ్సిడీతో డ్రిప్ పరికరాల కోసం రైతులు గగ్గోలు పెట్టినా.. ఆ పాలకులు ఏ మాత్రం పట్టించుకోలేదు.

● మళ్లీ టీడీపీ రాకతో...

మళ్లీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం రైతుల సంక్షేమం దృష్టి సారించింది. సబ్సిడీతో డ్రిప్ పరికరాలను అందించేలా చర్యలు తీసుకుంది. దీంతో రైతులు సూక్ష్మ సేద్యం వైపు మొగ్గు చూపుతున్నారు. గతంలో కంటే ఈసారి రైతులు తుంపర సేద్యానికి చాలా ఆసక్తి చూపుతున్నారు. ఉద్యాన పంటలైన టమోట, వంగ, మొక్కజొన్న తదితర పంటలు సాగుచేయడానికి సన్న, చిన్నకారు రైతులతో పాటు ఎస్సీ, ఎస్టీ రైతులకు సబ్సిడీ ఇస్తుండటంతో సాగు విస్తీర్ణంగా గణనీయంగా పెరిగింది. అమడగూరు మండలంలో 329 హెక్టార్లు, ఓడీచెరువు 314, నల్లమాడ 330 హెక్టార్లతో డ్రిప్ పరికరాలు మంజూరు చేసింది. అలాగే నల్లమాడ 72 ఎకరాలు, అమడగూరు 22, ఓడీచెరువులో 27 ఎకరాలకు స్పింకర్లను అందించింది. జిల్లాలో అధిక శాతం మంది ప్రజలకు వ్యవసాయ రంగమే ఆధారం. ప్రస్తుతం సూక్ష్మ సేద్యంలో దేశంలోనే 10వ స్థానంలో .. రాష్ట్రంలో నాలుగు స్థానంలో ఈ జిల్లా నిలిచింది.



డ్రిప్ సిస్టంను పరిశీలిస్తున్న ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్

● సబ్సిడీ ఇలా...

దరఖాస్తు చేసుకున్న అర్హులైన రైతులకు 10, 20 రోజుల్లో కంపెనీల ఆధారంగా ప్రభుత్వం డ్రిప్, స్పింకర్లు మంజూరు చేస్తోంది. అందులో ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు రైతులకు ఐదు ఎకరాల వరకు 90 శాతం రాయితీ, మధ్య తరహా రైతులకు 5 నుంచి 10 ఎకరాలలోపు వారికి 70 శాతం రాయితీ అందిస్తోంది.

● దరఖాస్తు ఇలా ..

సన్న చిన్న కారు రైతులకు డ్రిప్, స్పింకర్ల కోసం రైతులు సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలి. రైతులకు సంబంధించిన ఆధార్, పట్టాదారు పాస్‌పుస్తకం, వన్‌బీ అడంగల్, బ్యాంక్ పాస్‌పుస్తకం, ఫొటోలను గ్రామ ఉద్యాన సహాయకుడికి లేదా వ్యవసాయ శాఖాధికారికి అందచేయాలి. అర్హులైన రైతులు తమ వాటా చెల్లించిన వెంటనే సెల్‌ఫోన్‌కు సమాచారం వస్తుంది. దీంతో సూక్ష్మ సేద్య పరికరాల కంపెనీల వారు రైతులకు ఆ పరికరాలను అందజేస్తారు.

మంచి ఫలితాలు



గతంలో సబ్సిడీ లేకపోవడంతో సేద్యంపై దృష్టిసారించలేకపోయాం. ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వం సబ్సిడీ ప్రకటించడంతో స్పింకర్లు, డ్రిప్‌ల కోసం దరఖాస్తు చేసుకున్నా.. కొద్దిరోజుల్లోనే పరికరాలు మంజూరయ్యాయి. దీంతో తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో పంటల సాగుచేశాను. మూడు ఎకరాల్లో వేరుశనగ సాగు చేశా.

-రామచంద్ర, ఎం.కొత్తపల్లి, ఓడీసీ

వందశాతం సబ్సిడీ ఇవ్వాలి



గతంలో టీడీపీ ప్రభుత్వంలో ఇచ్చిన విధంగా ప్రస్తుతం కూడా డ్రిప్, స్ప్రింక్లర్లు వందశాతం సబ్సిడీతో ఇవ్వాలి. కరువు రైతులను ఆదుకోవాలి. డ్రిప్ వల్ల మంచి ఫలితాలు ఉంటున్నాయి. దీనిపై రైతులకు మరింత అవగాహన కల్పిస్తే మేలు.

-సత్యనారాయణనాయక్, వెంకటాపురం, ఓడీసీ

అర్హులందరికీ పరికరాలు

డ్రిప్, స్పింకర్ల కోసం దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ పరికరాలు అందచేస్తాం. 2024-25 ఆర్థిక సంవత్సరంలో జిల్లావ్యాప్తంగా 10,974 మంది రైతులకుగాను 12,044 హెక్టార్లల్లో డ్రిపులు, స్పింకర్లు మంజూరు చేశాం. సూక్ష్మ సేద్యంలో దేశంలోనే 10వ స్థానంలో .. రాష్ట్రంలో నాలుగో స్థానంలో ఈ జిల్లా నిలిచింది.

-సుదర్శన్, ఏపీఎంఐపీ పీడీ



పాముదుర్తిలో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న సత్యసాయి వైద్యులు

సత్యసాయి వైద్య శిబిరానికి భారీ స్పందన

బుక్కపట్నం, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): సత్యసాయి యూనివర్సిటీ పూర్వ విద్యార్థులు మండలంలోని పాముదుర్తి గ్రామంలో ఆదివారం నిర్వహించిన వైద్య శిబిరానికి అనూహ్య సంద్పన లభించింది. ఈ వైద్యశిబిరంలో దాదాపు 173 మందికి పరీక్షలు నిర్వహించారు. కంటి, దంతాలు, గైనిక్, జనరల్ పరీక్షలు చేశారు. ఈ పరీక్షల్లో 20 మందికి మెరుగైన చికిత్స నిమిత్తం పుట్టపర్తి, బెంగుళూరులోని సత్యసాయి ఆసుపత్రులకు సిఫార్సు చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు సుమ, ప్రశాంత్, నిఖిల్, క్రిష్ణాంజి, సీమా, యూకే వైద్యులు, సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణమూర్తి, మెడికల్ ఇన్‌చార్జీ రావు, సర్పంచ్ జ్యోతి క్రిష్ణమూర్తి పాల్గొన్నారు.

● ధర్మవరంరూరల్ : స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. లయన్ గూడూరు నాగయ్య కుటుంబ సభ్యులు దీనికి దాతలుగా వ్యవహరించారు. ఈ శిబిరంలో 93 మంది కంటి పరీక్షలు చేయించుకోగా వారిలో 72 మందిని శస్త్రచికిత్సలకు ఎన్నిక చేసినట్లు క్లబ్ అధ్యక్షుడు వేణుగోపాలాచార్యులు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ సభ్యులు గూడూరు మోహన్‌దాస్, రాజగోపాల్, రాధాకృష్ణ, చందా నాగరాజు, పల్లెం వేణుగోపాల్, రమేష్‌బాబు, నాగేంద్ర, వైద్యులు పాల్గొన్నారు.

శివంపల్లిలో తనిఖీలు

తాడిమర్రి, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని శివంపల్లి గ్రామంలో ఆదివారం తెల్లవారజామున తాడిమర్రి పోలీసులు కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. ప్రతి ఇంటిని, ఖాళీ స్థలాలను, కల్లాలను సోదాలు చేశారు. అనంతరం గ్రామస్థులతో సమావేశం నిర్వహించి.. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారి సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఐలు సూర్యనారాయణరాజు, ఆనంద్‌శేఖర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

5న పోస్టుకార్డుల ఉద్యమం



మాట్లాడుతున్న బంగారు క్రిష్ణమూర్తి

కదిరిఅర్బన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి మే 5న పోస్టుకార్డులతో విజ్ఞప్తి చేస్తున్నట్లు వాల్మీకి బోయ రాష్ట్ర అధ్యక్షుడు బంగారు క్రిష్ణమూర్తి తెలిపారు. ఆదివారం పట్టణంలో ఆయన మాట్లాడుతూ.. వాల్మీకి బోయలు అధిక సంఖ్యలో పోస్టుకార్డులు పంపి.. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆనంద్, మేకల శివప్రసాద్, సురేష్‌బాబు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న హైకోర్టు న్యాయవాది నరసింహులు

నల్లమాడ, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్డీటీ కార్యాలయంలో ఆర్పీపీ ఆధ్వర్యంలో న్యాయసేవా సదస్సును ఆదివారం నిర్వహించారు. ఇందులో హైకోర్టు న్యాయవాది పి.నరసింహులు మాట్లాడుతూ.. సమాజంలో చాలా మందికి చట్టాలు, హక్కులపై అవగాహన లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇలాంటి సదస్సులు నిర్వహించడం వల్ల ప్రజలకు అవగాహన కలుగుతుందన్నారు. సెల్‌ఫోన్ల అతి వినియోగం వల్ల నేటి యువత చెడిపోతోందని, వారిపై తల్లిదండ్రులు నిఘా వేసి ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు, సీనియర్ జర్నలిస్టు చందన్‌బాబు, ఆర్పీపీ మల్లె గంగాధర్, ఏటీఎల్ వన్నూర్‌స్వామి, ఓడీసీ ఆర్పీపీ మున్నా, బుట్టి నాగభూషణ నాయుడు, రైతు సంఘం నాయకులు చంద్రమోహన్ రెడ్డి, రామచంద్ర, గంగన్న, వెంకటయ్య, లక్ష్మీనరసమ్మ, మాజీ సర్పంచ్ మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

బురుజు పునర్నిర్మాణం



పునర్నిర్మించిన ఇరగలమ్మ బురుజు

నంబులపూలకుంట, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని శతాబ్దాల క్రితం గోవిందురాజులపల్లి ఏర్పడక ముందు నుంచి అక్కడ 30 అడుగుల ఎత్తైన ఇరగలమ్మ బురుజుండేంది. కాలక్రమేణ రాతితో నిర్మించిన ఆ బురుజు వర్షాలకు పూర్తిగా దెబ్బతిని పడిపోయింది. దీంతో గ్రామస్థులు చందాలు వేసుకుని... దాదాపు రూ. పది లక్షలకుపైగా ఖర్చు చేసి రాతితో ఆ బురుజును పునర్నిర్మించారు. ఇటీవల దీని నిర్మాణం పూర్తయింది. బురుజు పై భాగంగాలో విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు.



రాత్రిపూట విద్యుత్ వెలుగుల్లో..

క్రైం న్యూస్..

మామిడి చెట్ల నరికివేత



నరికివేసిన మామిడిచెట్టు

నల్లమాడ, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడమేకలపల్లికి చెందిన రైతు నారాయణ పొలంలోని ఐదేళ్లుగా పెంచిన 75 మామిడి చెట్లను గుర్తు తెలియని వ్యక్తులు నరికివేశారు. శనివారం రాత్రి దీన్ని గుర్తించిన గ్రామస్థులు నారాయణకు సమాచారం ఇచ్చారు. దీంతో ఆయన ఆదివారం ఉదయం తోటకు వెళ్లి పరిశీలించాడు. పోలీసు లకు ఫిర్యాదు చేశాడు.

పోక్సో కేసుపై డీఎస్పీ విచారణ

గాండ్లపెంట, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామంలో ఏడేళ్ల బాలికపై 17 యేళ్ల బాలుడు అత్యాచారం చేశారని బాధితురాలి తల్లిదండ్రులు ఫిర్యాదు మేరకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో శనివారం పోక్సో కేసు నమోదైన విషయం తెల్సిందే. దీంతో డీఎస్పీ శివనారాయణస్వామి ఆదివారం ఆ గ్రామానికి వెళ్లి విచారణ చేపట్టారు. గ్రామస్థులతో ఆరా తీశారు. ఆయన వెంట కదిరి రూరల్ సీఐ నాగేంద్ర, హెడ్ కానిస్టేబుల్ గంగాధర్, పోలీసులు, వీఆర్‌ఓలు చంద్రశేఖర్‌రెడ్డి, క్రిష్టప్ప ఉన్నారు.

కోడిపందెంరాయుళ్ల అరెస్టు

కదిరి, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): తలుపుల మండలం లక్కసముద్రం గ్రామ శివారు ప్రాంతాల్లో కోడిపందెలు ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ నరసింహుడు ఆదివారం తెలిపారు. వారి వద్ద ఉన్న ఐదు కోడిపుంజులు, రూ.6,100ను స్వాధీనం చేసుకున్నామని, మరో ఇద్దరు పరారీలో ఉన్నారని చెప్పారు.



సమ్మేళనంలో పాల్గొన్న కవులు

ఉగ్రవాదం.. మానవాళికే ముప్పు

కవి సమ్మేళనంలో వక్తలు

కొత్తచెరువు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదంతో ప్రపంచ మానవాళికే ముప్పు అని పలువురు కవులు స్పష్టం చేశారు. స్థానిక నెహ్రూనగర్‌లోని చిత్రావతీ సాహితీ కళాపీఠం కార్యాలయంలో ఆదివారం కవి సమ్మేళనాన్ని ఆ సంఘం అధ్యక్షుడు భీమినేని జనార్ధన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇందులో జిల్లాలోని కవులు పాల్గొన్నారు. కవి ఈషాక్ మాట్లాడుతూ.. ఉగ్రవాదం వల్ల మానవాళికి జరిగే అనర్థాలను తన కవితతో ప్రజలకు అవగాహన కల్పిస్తానన్నారు. ఉగ్రవాదాన్ని ప్రపంచంలోని అన్ని దేశాలు కలిసి కట్టుగా అంతమొందించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ప్రజలను చంపాలని ఏ మతగ్రంథంలోనూ లేదని, కొంత మంది చాందసవాదులతో ఓ మతానికి చెడ్డపేరు తెస్తున్నారని వాపోయారు. భారత దేశంలో ఉండి .. ఉగ్రవాదులకు సహకరించినా.. వారి చర్యలకు మద్దతు తెలిపినా.. జన్మనిచ్చిన తల్లిని మోసం చేసినట్లేనని, దీన్ని ప్రతి ఒక్కరూ గమనించాలని అన్నారు. కార్యక్రమంలో కవులు విజయ్ కుమార్, చంద్రాయుడు, అవరా చంద్రబాబు, షామీర్, రవి పాల్గొన్నారు.

పుట్టపర్తిలో చిరుజల్లులు

పుట్టపర్తిరూరల్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మండుతున్న ఎండలకు ఉక్కిరిబిక్కిరి అవుతున్న పట్టణ వాసులకు ఆదివారం రాత్రి చిరుజల్లులు కాస్తా ఉపశమనం కలిగాంచాయి. ఐదు నిమిషాల పాటు కురిసిన చిరుజల్లులకు పట్టణంలోని ప్రధాన రహదారిపై నీరుపారింది. అలాగే కొత్తచెరువు, మడకశిరాలో ఈదురుగాలులతో కూడిన చిరుజల్లులు పడ్డాయి.



పుట్టపర్తిలో పడుతున్న చిరుజల్లులు



ఓడీసీ: 42 సంవత్సరాల తర్వాత సమావేశమైన పూర్వ విద్యార్థులతో ఉపాధ్యాయులు



తాడిమర్రి : 25 సంవత్సరాల తర్వాత కలిసిన పూర్వవిద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమావేశం

ఓబుళదేవరచెరువు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1983-84లో పదో తరగతి చదివిన విద్యార్థులు దాదాపు 42 సంవత్సరాల తర్వాత అదే పాఠశాలలో ఆదివారం సమావేశమయ్యారు. నాటి ఉపాధ్యాయులు రామచంద్రారెడ్డి, బాబాఫకృద్దీన్, జమాల్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి, పూర్వ విద్యార్థులు శ్రీనివాసరాజు, ఉట్ల మహేశ్వర్‌రెడ్డి, గొర్తిపల్లి మహమూబ్‌బాషా, నరసింహులు, గిరి, పద్మ, లక్ష్మీనరసమ్మ, టీసీ ఓబులేసు, లక్ష్మీనర్సు, టీచర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

● తాడిమర్రి : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2000 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు దాదాపు 25 సంవత్సరాల తర్వాత అదే పాఠశాలలో ఆదివారం సమావేశయ్యారు. నాటి ఉపాధ్యాయులను ఊరేగింపుగా పాఠశాలవద్దకు తీసుకొచ్చారు. వారిని ఘనంగా సన్మానించారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న తోటి స్నేహితులను ఆదుకోవాలని నిర్ణయించుకున్నారు.

దొంగలపై త్రినేత్రం..!

● చోరీల అడ్డుకట్టకు నూతన విధానం

● పలు కూడళ్లలో సీసీ కెమెరాల ఏర్పాటు



పట్టణంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరా

మడకశిరటౌన్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ఐదు మండలాల పరిధిలో పోలీస్ సిబ్బంది కొరత వల్ల అసాంఘిక కార్యకలాపాలు అరికట్టడంలో కొంత వెనకబడ్డారన్న వాదన వినిపిస్తోంది. నియోజకవర్గ వ్యాప్తంగా ఐదు స్టేషన్ల పరిధిలో 30 మంది వరకు సిబ్బంది కొరత ఉన్నట్లు పోలీసు అధికారులు చెబుతున్నారు. అయితే అధికారికంగా చెప్పేందుకు విముఖత చూపుతున్నారు. కొన్ని నెలలుగా మడకశిర పట్టణంలో వరుస దొంగతనాలు జరుగుతుండటంతో పట్టణ వాసులు ఆందోళన చెందుతున్నారు. దేవాలయాలను దొంగలు లక్ష్యంగా చేసుకొని చోరీలకు పాల్పడుతున్నారు. రెండు మూడు నెలల క్రితం మారుతీనగర్‌లో వెలిసిన అభయాంజనేయస్వామి ఆలయంలో హుండీని ఎత్తుకెళ్లి గ్రామ సమీపంలో దానిని పగులగొట్టి డబ్బులు తీసుకొని వెళ్లారు. దీంతోపాటు మధుగిరి రోడ్డులో ప్రధాన రహదారి పక్కనే ఉన్న హార్డ్‌వేర్‌షాపులు, బేకరీల్లో రాత్రి వేళల్లో దొంగతనాలకు తెగబడుతున్నారు. పట్టణంలో దొంగతనాలు అధికం కావడంతో పట్టణ వాసులు ఆందోళన చెందుతున్నారు. మారుతీనగర్‌లో ఉద్యోగుల ఇళ్లు లక్ష్యంగా చేసుకొని దొంగతనాలకు పాల్పడ్డారు. ఇంతవరకు పోలీసులు దుండగులను పట్టుకోలేక పోయారు. దీనిపై ఆరా తీసిన ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి వినూత్న ఆలోచన చేశారు. దొంగతనాలు అరికట్టాలంటే ఆపరేషన్ త్రినేత్రతోనే సాధ్యపడుతుందని, నియోజకవర్గ వ్యాప్తంగా అమలు చేస్తే దొంగల్లో భయం పుడుతుందని కార్యాచరణ మొదలుపెట్టారు. పట్టణంలోని ప్రధాన సర్కిళ్లతోపాటు దుకాణాల వద్ద అధునాతన సాంకేతిక పరిజ్ఞానం కల్గిన సీసీ కెమెరాలను ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టారు. కొందరు వ్యాపారులకు వర్తకులకు కమిటీ బాధ్యతలను అప్పగించారు. ఎక్కడెక్కడ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి, వాటికి సంబంధించిన కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం తదితర విషయాలపై పోలీసు అధికారులు, వ్యాపారులతో చర్చించి వారం రోజుల్లోపు పూర్తి చేయనున్నారు.



మడకశిర సర్కిల్ కార్యాలయం

నేరాల అడ్డుకట్టకు ఆపరేషన్ త్రినేత్ర ఒక్కటే మార్గం

పట్టణంతోపాటు నియోజకవర్గ వ్యాప్తంగా అసాంఘిక కార్యకలాపాలు, దొంగతనాలు ఇతర నేరాలు అరికట్టడంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం ఆపరేషన్ త్రినేత్రతో సాధ్యపడుతుందని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, గుండుమల తిప్పేస్వామి అన్నారు. పోలీస్ అధికారులు, దుకాణాల వ్యాపారులతో కలిసి సమావేశంలో నిర్ణయం తీసుకొన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం, ప్రతి పౌరుడిని పోలీసును చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రధానంగా మధుగిరి సర్కిల్, హిందూపురం రోడ్డు, అమరాపురం రోడ్డు, పెనుకొండ రోడ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని దిశా నిర్దేశం చేశారు. ఇది విజయవంతమైతే జిల్లా స్థాయిలో ఆపరేషన్ త్రినేత్ర దోహద పడుతుందని నేతలు పేర్కొంటున్నారు.

ఎస్పీ చేతుల మీదుగా కంట్రోల్ రూమ్ ప్రారంభం

జిల్లా ఎస్పీ రత్న చేతుల మీదుగా పట్టణంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి మడకశిర సర్కిల్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌ను ప్రారంభించారు. సీసీ కెమెరాలు ఏర్పాటుకు సహకారం అందించిన పట్టణవాసులను అభినందించారు.

న్యూస్ బాక్స్

సిద్దేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



అమరాపురం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హేమావతి గ్రామంలో వెలసిన హెంజేరు సిద్దేశ్వరస్వామికి ఆదివారం ప్రత్యేక పూజలునిర్వహించినట్లు ఉత్సవ కమిటీ ఛైర్మన్ కరేగౌడ్ తెలిపారు. వివిధ అభిషేకాలు, కుంకుమార్చనలు, రుద్రాభిషేకం, తైలాభిషేకం నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూలతో అలంకరించి వెండి కవచం ధరించి భక్తాదులకు దర్శనమిచ్చారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందించారు.

కాశీవిశ్వేశ్వరుడికి..



పెనుకొండ, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అర్చకులు రాఘవేంద్రచారి ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, రుద్రాభిషేకం నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

పర్యాటక వలయంతో ఆర్థికాభివృద్ధి

● చరిత్రకారుడు మైనాస్వామి



మైనాస్వామిని సన్మానిస్తున్న జనసేన నాయకులు

గోరంట్ల, ఏప్రిల్27(ఆంధ్రజ్యోతి): హేమావతి పర్యాటక వలయం ప్రారంభమైతే జిల్లా పర్యాటక ముఖచిత్రం పూర్తిగా మారిపోతుందని పర్యాటక రంగ నిపుణుడు, చరిత్రకారుడు మైనాస్వామి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉగాది పురుష్కారం అందుకున్న మైనాస్వామిని గోరంట్ల మాధవరాయ ఆలయంలో అనంతపురం జనసేన నాయకుడు శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఆదివారం సన్మానించారు. మైనాస్వా మి మాట్లాడుతూ పర్యాటక వలయం ప్రతిపాదన ప్రభుత్వం వద్ద ఉందన్నారు. వలయం ఏర్పాటుతో హేమావతి, లేపాక్షి, పెనుకొండ, గోరంట్ల, మేరెడ్డిపల్లి, వానవోలు, కదిరి, కటారుపల్లి, తిమ్మమ్మ మర్రిమాను తదితర ప్రాంతాల్లోని ఆలయాలు మౌ లిక సదుపాయల కల్పనతో రూపురేఖలు మారిపోతాయన్నారు. పర్యాటక వలయం ద్వారా జరిగే అభివృద్ధితో సత్యసాయి జిల్లాలో ఆర్థికాభివృద్ధితోపాటు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. జనసేన రాయుడు, రామక్రిష్ణ, శ్రీనివాస్, ప్రిన్సిపాల్ భక్తవత్సలం, టీడీపీ నారాయణస్వామి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

బస్ షెల్టరు ఏర్పాటు చేయండి



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న టీడీపీ నాయకులు

పెనుకొండ, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): పెనుకొండ నగర పంచాయతీ పరిధిలోని పరమేశ్వరపురంవద్ద రోడ్లకు ఇరువైపులా బస్ షెల్టరును ఏర్పాటు చేయాలని, బస్సు నిలిపేలా చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరారు. ఆదివారం శుభోదయ కార్యక్రమంలో భాగంగా టీడీపీ నాయకులు వెంకటాపురం తండా పరమేశ్వరపురం గ్రామాలను సందర్శించి ప్రజలను కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీలో డ్రైనేజీ ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలని, వీధి దీపాలు వెలగడంలేదని ప్రస్తుతం ఉన్న బోర్లలో నీరు ప్లాస్టిక్ వాసన వస్తోందని, కొత్తబోరు మంజూరుచేయాలని, శ్మశానానికి స్థలం కేటాయించాలని కోరారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ స్తంభాలు మార్చి లైట్లు వేయాలని కోరారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని నాయకులు హామీ ఇచ్చారు. టీడీపీ మండల కన్వీనర్ శ్రీరాములు, రమణమ్మ, పాలడుగు చంద్ర, సాయిప్రసాద్, త్రివేంద్ర, బాబు నాయక్, శ్రీనివాసనాయక్ పాల్గొన్నారు.

మూడు బోర్ల ఏర్పాటు



వినాయకనగర్‌లో బోరు వేయిస్తున్న టీడీపీ నాయకులు

సోమందేపల్లి, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వినాయకనగర్, మణికంఠ కాలనీ, మార్కెట్‌రోడ్డు ప్రాంతాల్లో టీడీపీ నాయకులు ఆదివారం మూడు బోర్లు వేయించారు. మంత్రి సవిత ఆదేశాల మేరకు పట్టణంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యల్లో భాగంగా బోర్లు వే యిస్తున్నట్లు నీరుగంటి చంద్ర తెలిపారు. మూడు బోర్లలో పుష్కలంగా నీరు పడటంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. నాయకులు సూరి, కిష్టప్ప, నాగరాజుయాదవ్, మద్దిలేటి, బాలు, జక్కాచంద్ర, గాజుల చంద్ర, సజ్జరాయుడు, శ్రీనివాసులు, గోపీమోహన్, మహేంద్ర, తూమకుంట రామాంజనేయులు పాల్గొన్నారు.

కాగడాలతో ర్యాలీ

లేపాక్షి, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లోని పహల్గాంలో తీవ్రవాదులు జరిపిన కాల్పులకు నిరసనగా ఆదివారం ఛత్రపతి శివాజీ యువసేన ఆధ్వర్యంలో కాగడాల ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ పాకిస్థాన్‌కు భారత ప్రభుత్వం తగిన బుద్ధిచెప్పాలని అన్నారు. తీవ్రవాదులను మట్టుపెట్టాలన్నారు. బీజేపీ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.



కాగడాలతో ర్యాలీ చేస్తున్న నాయకులు

జయమంగళి నదిలో గార్మెంట్స్ వ్యర్థాలు



జయమంగళి నదిలో వేసిన వ్యర్థాలు

పరిగి, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): కాలువపల్లి గ్రామ సమీపంలోని నిషా గార్మెంట్స్ నిర్వాహకులు జయమంగళి నదిలో వ్యర్థాలను వదులుతున్నారు. పరిశ్రమలో వాషింగ్ అయిన రసాయన వ్యర్థాలు, మురుగునీరు, ఇంకిపోయి గడ్డలు కట్టడంతో వాటిని సంచిలో నింపి జయమంగళి నదిలో తరలించి అపరిశుభ్రం చేస్తున్నారు. ఇంతకు ముందు వాషింగ్ వ్యర్థాలు, మురుగునీరు పైపుల ద్వారా నదిలో కలిసేది. ప్రస్తుతం సంచుల్లో నింపి పడేస్తున్నారని స్థానకులు అంటనాన్నారు. ప్రజలు, రైతులు, స్థానిక నాయకులు గార్మెంట్స్ యాజమాన్యానికి సమస్యను వివరించినా ఒకరోజు మాత్రమే పరిష్కరించి తిరిగి అలాగే వదిలేస్తున్నారు. సంబంధిత అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా గార్మెంట్స్ వ్యర్థాలు నదిలోకి తరలించకుండా సరిహద్దులోనే డంప్‌చేసుకునేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

జూన్ 6 వరకు వేసవి శిక్షణ తరగతులు

హిందూపురం, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గ్రంథాలయంలో సోమవారం నుంచి జూన్ 6వరకు వేసవి శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ కార్యక్రమంలో పుస్తకపఠనం, కథలు వినడం, డ్రాయింగ్, చెస్ తదితర అంశాలపై తరగతులు ఉంటాయన్నారు. ఉదయం 8 నుంచి 11గంటలకు వరకు విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రోత్సహించి గ్రంథాలయానికి పంపాలని ఆయన కోరారు.

ఎస్ఎఫ్ఐకి రాజీనామా

హిందూపురం, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): ఇప్పటి వరకు ఎస్ఎఫ్ఐలో కొనసాగిన విద్యార్థి సంఘం నాయకులు ఆ సంఘానికి రాజీనామా చేసినట్లు చంద్రశేఖర్, తరుణ్ పేర్కొన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో వారు విలేకరులతో మాట్లాడుతూ ఎనిమిదేళ్లుగా ఎస్ఎఫ్ఐలో ఉండి విద్యార్థుల తరపున పోరాడి సమస్యలు పరిష్కరించామన్నారు. జిల్లా అధ్యక్షుడు సొంత నిర్ణయాలు తీసుకోవడంవల్ల సంఘానికి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. హుస్సేన్, రోహిత్, ఆరీఫ్, జశ్వంత్, పవన్, లిఖిత్ పాల్గొన్నారు.

ఈకేవైసీ చేయించుకోండి

అమరాపురం, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): రేషన్‌కార్డు లబ్ధిదారులు 30వ తేదీలోపు తప్పకుండా ఈకేవైసీ చేయించుకోవాలని సీఎస్‌డీటీ నవీన్‌కుమార్ కోరారు. తహసీల్దార్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వం రాయితీతో బియ్యం, చక్కెర, కందిపప్పు అందిస్తోందన్నారు. కార్డు లబ్దిదారులు ఇప్పటి వరకు ఏకేవైసీ చేయించుకోని వారు వెంటనే సమీపంలోని డీలర్లవద్దకువెళ్లి చేయించుకోవాలన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

అగళి, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ యాదవేంద్ర తెలిపారు. ఉదయం 10గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. మండలంలోని జడ్పీటీసీ ఎంపీపీ, సర్పంచులు, ఎంపీటీసీలు, అన్నిశాఖల అధికారులు హాజరు కావాలన్నారు. సమావేశానికి హాజరుకాని అధికారులపై చర్యలు ఉంటాయన్నారు.

విద్యుత్ సమస్యకు పరిష్కారం



అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసిన దృశ్యం

మడకశిర రూరల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుళ్ళసముద్రం ఎస్సీ కాలనీలో కొంత కాలంగా విద్యుత్ సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మాజీ సర్పంచు జైపాల్, ఆ కాలనీ వాసులు శనివారం ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. స్పందించిన వారు ఆదివారం కాలనీలో అదనపు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయించారు.

పగలే చోరీ

గోరంట్ల, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మక్కామసీదు వీధిలో ఉంటున్న నజీమున్నీషా నివాసంలో ఆదివారం పగలే చోరీ జరిగినట్లు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆదివారం మధ్యాహ్నం తెలిసిన మహిళ మరో ఇద్దరు మహిళలను పిలుచుకుని వచ్చి బట్టలు మార్చుకోవాలని కోరడంతో నజీమున్నీషా అనుమతించింది. దీంతో వారు బెడ్‌రూమ్‌లోకెళ్లి బట్టలు మార్చుకుంటున్నట్లు నటిస్తూ బీరువాలోని 12తులాల బంగారు నగలు, రూ. 50వేల నగదు ఎత్తుకెళ్లారు. కొంత సమయంతో తరువాత నజీమున్నీషా బెడ్ రూమ్‌లోకి వెళ్లి చూడగా బీరువా తలుపులు తెరిచి ఉండడంతో అనుమానం వచ్చి పరిశీలించగా, బంగారు, నగదు చోరీ అయినట్లు గుర్తించింది. వచ్చినవారికి ఫోన్ చేయగా స్విచ్‌ఆఫ్ రావడంతో చేసేదిలేక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరు సీఐ శేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఆక్సిజన్ మిషన్ అందజేత



బాబాజాన్‌కు ఆక్సిజన్ మిషన్‌ను అందజేస్తున్న కమిటీ సభ్యులు

గోరంట్ల, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సంతమార్కెట్ వీధిలో నివాసముంటున్న బాబాజాన్ భార్య షకీల అనారోగ్యంతో ఉండగా, జమియత్ ఉల్మా కమిటీ సభ్యులు ఆక్సిజన్ మిషన్‌ను ఆదివారం అందించారు. ఆమె ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతూ, ప్రతిరోజు మూడుగంటలపాటు మిషన్ ద్వారా ఆక్సిన్ ఇవ్వాల్సి ఉంది. కుటుంబ ఆర్థిక ఇబ్బందులను తెలుసుకన్న కమిటీ స్పందించింది. రూ.30వేలు విలువ చేసే ఆక్సిజన్ మిషన్‌తోపాటు రూ.2500 వైద్య ఖర్చుల నిమిత్తం భర్తకు అందించారు. అలాగే ఆటో డ్రైవర్ అసదుల్లా కుతురికి పెళ్లిచేయలేక ఆర్థిక ఇబ్బందులతో ఉన్నట్లు కమిటీకి తెలుపగా, రూ.5 వేలు ఆర్థికసాయం అందచేశారు. కమిటీ మండల అధ్యక్షుడు మౌలానా షఫీవుల్లా, మౌలానా అబ్దుల్లా, అబూఫైజ్, మునాఫ్, ముక్తియార్, ఆటో ముస్తఫా పాల్గొన్నారు.

మే డేను జయప్రదం చేయండి

హిందూపురం, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): కార్మికుల దినోత్సవమైన మేడేను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వినోద్‌కుమార్ కోరారు. ఆదివారం మేడేకు సంబంధించిన కరపత్రాలను మున్సిపల్ కార్యాలయంలోని జేఏసీ కార్యాలయంవద్ద విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలో అన్ని ప్రధాన కూడళ్లలో జెండా ఆవిష్కరణలు ఉంటాయన్నారు. తహసీల్దార్ కార్యాలయంలోని గాంధీ సర్కిల్‌లో ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. రైతు సంఘం నాయకులు చలపతి, తాలూకా కార్యదర్శి మారుతిరెడ్డి, నరేష్, ముత్యాలప్ప, సిద్దగిరి సురేష్, చౌళూరు రవికుమార్ పాల్గొన్నారు.

చెట్టు నుంచి పడి వ్యక్తి మృతి

చిలమత్తూరు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన ఇబ్రహీం (40) అనే వ్యక్తి చింత చెట్టుపై నుంచి కిందపడి మృతి చెందాడు. ఎస్ఐ మునీర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఈనెల 19వ తేదీన ఇంటి నుంచి చింత చిగురు తెస్తానని చెప్పి ఇబ్రహీం వెళ్లాడు. అయితే ఆ రోజు నుంచి ఇంటికి రాకపోవడంతో ఎక్కడో బంధువుల ఊరుకో, తెలుసునోళ్ల ఊరికో వెళ్లి ఉంటాడని ఇంట్లో వారు అనుకొని అతని ఆచూకీ కోసం ప్రయత్నించలేదు. అయితే ఆదివారం ఉదయం స్థానిక పంచాయతీ కార్యాలయం వెనుక భాగంలో ఉన్న చింతచెట్టు వద్దకు కొందరు చింత చిగురు కోసుకోవడానికి వెళ్లి చెట్టు కింద దుర్వాసన వస్తున్న మృతదేహం గుర్తించి సమాచారం ఇచ్చారన్నారు. అక్కడికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించగా అతని ప్యాంటు రెండు జేబుల్లో చింత చిగురు ఉంది. దీనిని గుర్తించి గ్రామంలో సమాచారం ఇవ్వడంతో ఇబ్రహీం భార్య అమ్రిన్ వచ్చి మృతదేహాన్ని పరిశీలించింది. మృతి చెందిన వ్యక్తి తన భర్తే అని చెప్పడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్.ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు. ఇబ్రహీంకు ఒక కుమారుడు ఉన్నాడు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

చిలమత్తూరు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని మొరంపల్లి గ్రామానికి చెందిన మురళి(45) అనే వ్యక్తి రోడ్డు ప్రమాదంలో ఆదివారం మృతి చెందాడు. మృతుడు మురళి పెట్రోల్ కోసం ద్విచక్రవాహనంలో బాగేపల్లి సమీపంలోని 44వ జాతీయ రహదారిపై ఉన్న ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకుకు వెళ్లాడు. అక్కడ పెట్రోల్ తీసుకొని ద్విచక్రవాహనంపై రోడ్డు మలుపు తిరుగుతుండగా వెనుక నుంచి వచ్చిన బొలెరో వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. బాగేపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి..

గుడిబండ, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాకేపల్లి గ్రామానికి చెందిన గోవిందప్ప(60) అనే వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందినట్లు ఎఎస్ఐ రమణ తెలిపారు. గోవిందప్పకు మతిస్థిమితం సరిగాలేకపోవడంతో సొంత గ్రామంలో ప్లాస్టిక్ డబ్బాలు, పేపర్లు, కవర్లు ఏరుకుని జీవనం సాగిస్తుండేవాడు. కుటుంబ సభ్యులంతా బెంగళూరులో ఉంటున్నారు. ఇతను గ్రామంలో ఒక్కడే ఉంటున్నాడు. 25వ తేదీన రాత్రి ఇంటి ఆవరణలో రాయిపై పడి మృతిచెందాడు. భార్య భాగ్యమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బావిలో పడి వృద్ధుడు..

గుడిబండ, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని కిరికెర గ్రామానికి చెందిన హనుమంతరాయప్ప(65) అనే వృద్ధుడు బావిలోపడి మృతిచెందినట్లు ఎస్ఐ రాజకుల్లాయప్ప ఆదివారం తెలిపారు. హనుమంతరాయప్ప పొలం పనులు చేస్తుండేవాడు. కాలకృత్యాలు తీర్చుకోవడానికి బావివద్దకు వెళ్లి బావిలోదిగాడు. కాలుజారి అందులో పడ్డాడు. అతనికి ఈత రాకపోవడంతో నీటిలో మునిగి మృతిచెందినట్లు ఎస్ఐ తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

యువకుడిపై కేసు

పరిగి, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): ఓ యువతి భారత్‌కు మద్దతుగా కొన్ని రోజుల క్రితం సోషల్ మీడియా ద్వారా వీడియో చేస్తే, దానికి వ్యతిరేకంగా పరిగి మండల కేంద్రానికి చెందిన ఆఫ్రీది అనే యువకుడు భారత్‌ను అవమానించేలా ఆ యువతి వీడియోకి రిప్లై ఇచ్చాడు. దీనిని గమనించిన స్థానిక ప్రజలు, టీడీపీ, బీజేపీ మండల కన్వీనర్ మూర్తి, యువకుడిపై మండిపడుతూ నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ పరిగి పోలీస్ స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశారు. స్పందించిన ఎస్ఐ రంగుడు యాదవ్ పలు సెక్షన్లపై కేసు నమోదుచేసి నిందితున్ని ఆదివారం అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు

గోరంట్ల, ఏప్రిల్27 (ఆంధ్రజ్యోతి): మండలంలో వేర్వేరు ప్రాంతాల్లో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు గాయపడ్డారు. హిందూపురం ప్రధాన రహదారిపై సామలపల్లివద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని మిషన్ తండాకు చెందిన వసంతనాయక్ తీవ్రవంగా గాయపడ్డాడు. వెంటనే 108లో హిందూపురం ఆసుపత్రికి తరలించారు. అలాగే పుట్టపర్తి మండలానికి చెందిన అశోక్‌నాయుడు, రాధిక దంపతులు మొక్కుజొన్న విత్తనాల కోసం ద్విచక్రవాహనంపై కర్ణాటక రాష్ట్రం బాగేపల్లికి వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది. చెక్‌పోస్టు సమీపంలోని ఇండియన్ పెట్రోల్ బంక్ వద్ద కారు ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. దంపతులు ఇద్దరు గాయపడ్డారు. వారిని వెంటనే గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురగా వైద్యులుచికిత్సలు చేసి మెరుగైన వైద్యంకోసం అనంతపురం తరలించారు.

యువకుడిపై దాడి

చిలమత్తూరు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి ఆ మత్తులో ఓ యువకుడిపై అతడి స్నేహితుడు బీర్ బాటిల్‌తో దాడిచేసి తీవ్రంగా గాయపర్చాడు. వివరాలిలా ఉన్నాయి.. చిలమత్తూరు మండలం కోడూరులో నివాసముంటూ భిక్షాటన చేసే నారాయణస్వామి అనే యువకుడు పాలసముద్రానికి చెందిన అతని స్నేహితుడితో కలిసి ఆదివారం కర్ణాటకలోని బాగేపల్లి వద్ద మద్యం తాగారు. వారిద్దరూ మద్యం మత్తులో వాదోపవాదాలు జరిగి ఘర్షణ పడ్డారు. ఈ దాడిలో నారాయణస్వామిని అతని స్నేహితుడు బీర్ బాటిల్‌తో దాడి చేశాడు. అతని చెంప భాగంలో గాజు పెంకులు తగలడంతో తీవ్ర రక్త స్రావం జరిగింది. దాడిచేసి స్నేహితుడు పరారయ్యాడు. గాయపడిన అతడు తండ్రి రెడ్డప్పకు సమాచారం ఇవ్వడంతో వెంటనే అక్కడికి వెళ్లి చికిత్స కోసం బాగేపల్లి ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై బాగేపల్లి పోలీసులను వివరణ కోరగా తమకు ఫిర్యాదు అందలేదని తెలిపారు. ఆయపడిన నారాయణస్వామి ఆరోగ్య పరిస్థితి బాగానే ఉన్నట్లు అతని తండ్రి తెలిపాడు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

హిందూపురం, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మండల సమీపంలోని శ్రీకంఠపురం చెరువులో పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్ట్‌చేసి వారి వద్ద రూ.2,500 స్వాధీనం చేసుకున్నట్లు టూటౌన్ సీఐ కరీం తెలిపారు. ఆదివారం సాయంత్రం శ్రీకంఠపురం చెరువు సమీపంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో అక్కడికి వెళ్లి ఏడుగురిని అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు.

గడ్డివామి దగ్ధం



అగ్నికి ఆహుతవుతున్న గడ్డివామి

సోమందేపల్లి, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని పందిపర్తి గ్రామంలో అశ్వత్థనారాయణకు చెందిన గడ్డివామికి ఆదివారం ఆకతాయిలు నిప్పంటించారు. దీంతో పెద్దఎత్తున మంటలు చలరేగి వాము అగ్నికి ఆహుతైంది. రైతు మాట్లాడుతూ వేసవిలో మూగజీవాలకు మేత దొరకడం కష్టమన్నారు. ఈ నేపథ్యంలో వేల రూపాయలు ఖర్చుచేసి వరి, శనగ కట్టిని ఇతర ప్రాంతాల నుంచి కొనుగోలుచేసి తీసుకొచ్చామన్నారు. గుర్తుతెలియని వ్యక్తులు గడ్డివాముకు నిప్పు పెట్టడంతో పూర్తిగా కాలిపోయిందన్నారు. రూ.2లక్షలు నష్టం వాటిల్లినట్లు తెలిపారు. గడ్డివామును ఆర్పడానికి స్థానికులు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది.



గతేడాది కంకర తేలిన రోడ్డు



ప్రస్తుతం వేసిన తారు రోడ్డు

మూడు దశాబ్దాల కల.. నెరవేరిన వేళ..

● రూ.కోటి నిధులతో తారు రోడ్డు నిర్మాణం

హిందూపురం, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మూడుదశాబ్దాలుగా కె. బసవనపల్లి నుంచి కొటిపికి వాహనాల్లో వెళ్లాలంటే 10కి.మి. చుట్టు తిరగాల్సి వచ్చేది. పలుసార్లు రోడ్డు వేయాలని బసవనపల్లి ఇందిరమ్మ కాలనీ, భరత్‌నగర్ వాసులు అధికారులు ప్రజా ప్రతినిధుల వద్ద వేడుకున్నారు. అంతేకాక గత ఎన్నికల సమయంలో రోడ్డు వేస్తేనే ఓటువేస్తామన్నారు. దీంతో ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అతని సతీమణి వసుందరదేవి వారికి హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకు బసవనపల్లి నుంచి లయోలా పాఠశాల వరకు రూ.కోటి నిధులతో తారు రోడ్డు నిర్మాణం చేపట్టారు. దీంతో ఆ కాలనీలవాసులు ప్రభుత్వానికి, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.